# గురువింద గింజలు

ఇంపావుటూరి మురళీ మోహనరావు

బాలకార్మిక వ్యతిరేకోద్యమ సమితి ఆఫీసు అది. ప్రముఖ సంఘ సేవకురాలు గీతాబాయి. ఈ ఉద్యమానికి నాయకురాలు. పెద్ద పారిశ్రామికవేత్త, రాజకీయంగా పలుకుబడి కలిగిన భూపతిరాజా భార్య అయిన గీతాబాయి పట్టణాలలో, పల్లెలలో వెట్టి చాకిరీకి గురౌతున్న అమాయక పసిబాలలను విముక్తి గావించి, వారిని స్కూళ్ళలో చేర్పించడం లక్ష్యంగా నాలుగు సంవత్సరాల క్రితం ఈ సమితి స్థాపించింది. అంగబలం, ఆర్థికబలం పుష్కలం కావడంతో అనతికాలంలో చాలా మంది ఉద్యమంలో చేరారు. వారిలో ప్రముఖులు జిల్లా కలెక్టర్‌గారి భార్య వందన, ఒక మంత్రిగారి భార్య రాధ మొదలైనవారు.



ఆ రోజు సమావేశం జరుగుతున్నది. గీతాబాయి, రాధ, వందన సినిమా స్టార్ల కంటే మిన్నగా అలంకరించుకుని పుష్‌బ్యాక్ ఛెయిర్స్‌లో కూర్చుని ముచ్చట్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

"మన సంస్థ గురించి పత్రికలలో వార్తలొచ్చి దాదాపు వారం రోజులైంది. మనం మళ్ళీ ఏదైనా కార్యక్రమం చేపట్టాలి" అన్నది గీతాబాయి.

"అవును. మనం చేస్తున్న కార్యక్రమాల వలన మనకు అంతో ఇంతో ప్రచారం రావడంతో పాటు అనేక అంతర్జాతీయ సంస్థలు కూడా మనలను గుర్తిస్తున్నాయి. ఇప్పటి వరకు మనం దాదాపు ఐదొందల మంది బాలకార్మికులకు విముక్తి కల్పించాం. అనేక మంది హోటళ్ళవారికి, ఫ్యాక్టరీల వారికి జరిమానాలు వేయించాం. దాంతో మనమంటే చాలా యాజమాన్యాలకు భయం పట్టుకుంది. పధ్నాలుగేళ్ళ లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడానికి జంకుతున్నారు. ఇది మనం సాధించిన విజయం" అన్నది వందన.

"నిజం. కానీ మన సేవలు జంట నగరాలకే పరిమితమౌతున్నాయి.

అలా కాకుండా జిల్లాలలో కూడా మన పేరు మార్మోగాలంటే మనం గ్రామాలలోకి వెళ్ళాలి. గ్రామాలలో బాలకార్మిక వ్యవస్థ బలంగా ఉంది. ధనిక రైతులు పేదవారికి అప్పులిచ్చి వడ్డీకింద వారి పిల్లలతో పని చేయించుకుంటున్నారు. ఎలాగైనా మనం దీనిని అరికట్టాలి" ఆవేశంగా అన్నది రాధ.

"మీరు చెబుతున్నది నిజమే. సిటీల్లో ప్రజలకు చట్టం, పోలీసులంటే భయం ఉంటుంది. పైగా చాలా మందికి మన గురించి తెలుసు. కానీ పల్లెల్లో ప్రజలకు ఈ చట్టాల గురించి ఏమీ తెలియదు. అందువలన వారిని భయపెట్టడం కొంచెం కష్టమౌతుంది" అన్నది గీతాబాయి.

"మీకా భయం అక్కర్లేదు. కావాలంటే మా వారికి చెప్పి మిలిటరీ వారినైనా తెప్పిస్తాను" అభయమిచ్చింది రాధ.

* * *

సాయంత్రం ఆరు గంటలకు ఇంటికెళ్ళింది గీతాబాయి. పనిమనిషి మంగమ్మ గేటు దగ్గర నిలుచుంది. "అమ్మగారూ పొద్దుట్నించీ జొరంగా ఉంది. రేపు పనికి రాను" చెప్పింది.

"నీకిదో మాయరోగం. ఏదో వంకపెట్టి నెలకు వారం రోజులు పని ఎగ్గొట్టడం నేర్చుకున్నావు." కోపంగా అన్నది గీతాబాయి.

"సత్తెపెమాణకం అమ్మగారూ! పొద్దుట్నించి వళ్ళు కాలిపోతున్నది."

"రేపు అంట్లు ఎవరు తోముతారు? నీ కూతురుని పంపించు."

"అది చిన్నపిల్లమ్మగారూ! పైగా ఇస్కూలుకు పోవాలె."

"ఒక్కరోజు స్కూలుకు వెళ్ళనంత మాత్రాన నీ కూతురు కలెక్టరు కాకుండా పోదు. నోర్మూసుకుని పంపించు." నిష్కర్షగా చెప్పి లోపలికెళ్ళింది గీతాబాయి.

* * *

అదో పల్లెటూరు. ఒక భూస్వామి ఇంటి ముందు ఆగింది డీలక్స్ బస్. గీతాబాయి, రాధ, వందన మరో నలుగురు మహిళలు, పదిమంది విలేకరులు, కెమేరాలు పట్టుకుని టీవీ వాళ్ళు బిలబిలమని దిగారు. భూస్వామి, మరో నలుగురు రైతులు చుట్టలు కాలుస్తూ అవరణలో కూర్చున్నారు. దూరంగా పశువుల పాకలో నలుగురు పిల్లలు గేదెలకు గడ్డి వేస్తున్నారు. హఠాత్తుగా దిగిన పటాలాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

గీతాబాయి గబగబా పిల్లల వద్దకెళ్ళింది. వాళ్లకు షేక్ హ్యాండిచ్చింది.

"బాబూ.. నీ పేరేంటి?" అడిగిందో పిల్లాడిని.

"రంగడు"

"నీ వయసెంత?"

"తెల్వదు."

"ఎన్నాళ్ళనుంచీ పని చేస్తున్నావు?"

"మూడేళ్ళ నుంచీ"

"నీకు జీతమెంత?"

"బువ్వ, గుడ్డలు పెట్టి సాలుకు రెండు వేలు."

గీతాబాయి ప్రశ్నలు వేస్తుంటే విలేకరులు రాసుకుంటున్నారు.

"నీకు పదేళ్ళు కూడా లేవు. చదువుకోవాల్సిన వయసులో చాకిరీ చేస్తున్నావు. స్కూలుకు వెళ్ళాలని లేదా?"

"ఉందమ్మగోరూ! కానీ మా నాయన దొర దగ్గర పనికి చేర్చిండు"

"నిన్ను స్కూలుకు పంపితే చదువుకుంటావా?"


"ఓ... చదువుకుని కలెక్టరునౌతా."

భూస్వామి వైపు చూసింది గీతాబాయి. "చూడండి! పాలుగారే ఇలాంటి పసిపిల్లలతో ఇటువంటి అమానుషమైన పనులు చేయించడం చట్టరీత్యానేరం. బాలకార్మిక వ్యవస్థను చట్టం నిషేధించింది. తక్షణమే ఈ పిల్లవాళ్ళను పని మాన్పించి స్కూల్లో చేర్పించండి. అందుకయ్యే ఖర్చు మీరే భరించాలి. లేకుంటే మీమీద కేసు పెట్టాల్సి ఉంటుంది" తీవ్రస్వరంతో అన్నది.

భూస్వామి నవ్వాడు. "చూడమ్మా! మాకు చట్టాల గురించి ఏమీ తెలియదు. పల్లెల్లో ఇలాంటివి మామూలే. కూలి పనులు చేసుకోవడం. పశువులను మేపుకోవడం నేరాలని మేము అనుకోం. మా పిల్లలకు ఐదారు సంవత్సరాలనుంచే పొలం పనులు నేర్పుతాం. మేమూ అలాగే పని చేశాం. ఈ ఊళ్ళో ఈ మధ్యనే మా పశువుల కొట్టంలోనే ఒక స్కూలు పెట్టారు. పంతులు వారానికోమారు వస్తాడు. ఆ స్కూల్లో చేరి వాళ్ళు చదువుకుంటామంటే నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు.

మర్నాడు అన్ని దిన పత్రికలలోనూ ఈ వార్త ప్రముఖంగా వచ్చింది. బాలకార్మికోద్ధరణకు గీతాబాయి చేస్తున్న సేవ నిరుపమానమని, ఇదే విధంగా ఆమె గతంలో వేలాదిమంది బాలకార్మికులను రక్షించి విద్యావంతులను చేశారని ప్రశంసించాయి. ఆ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులలో పద్మశ్రీ పురస్కారం గీతాబాయికి లభించింది. వారం రోజుల పాటు సన్మానాలు, సత్కారాలతో

## పాపం పిల్లి!



అవి 1978 లో బ్రిటిష్ ఆర్మీ లండన్‌లో అగ్నిమాపక దళాల విధులు చేపట్టే రోజులవి. అదే సమయంలో లండన్‌లో నివసించే ఒక వృద్ధ వనిత ఒక పిల్లిని ప్రేమగా పెంచుకుంటున్నదట. ఆ పిల్లి ఒకరోజు పెద్ద చెట్టు మీదకెక్కి క్రిందికి దిగి రాలేక పైనే వుండిపోవటంతో కంగారుపడి ఆమె ఆర్మీ సహాయం కోరింది. ఆర్మీ జవాన్లు హుటాహుటీన ఆమె ఇంటికెళ్ళి చెట్టుమీద ఉన్న ఆమె పిల్లిని వెంటనే రక్షించి క్రిందికి తెచ్చారుట. ఎంతో సంతోషించిన ఆ వనిత తన కృతజ్ఞతా సూచకంగా వారినందరినీ ఆ సాయంత్రం తన ఇంట్లో తేనీటి విందుకి పిలిచిందట. విందు ముగిశాక వారంతా రాత్రి ఆమెకి 'బై బై' చెప్పి హడావిడిగా తిరిగి వెళ్ళే సమయంలో వారి జీపుకింద ఆ పిల్లి పడి చనిపోయింది. పాపం ముసలమ్మ లబోదిబోమంది. **– వి.కె.ఎమ్**

క్షణం తీరిక లేకుండా గడిపింది గీతాబాయి.

* * *

ఆ రోజు గీతాబాయి తన నాలుగేళ్ళ ముద్దుల కూతురు అనూహ్యతో ఆడుకుంటు న్నది. అనూహ్య నర్సరీ చదువుతున్నది. పాపకు డాన్సు, సంగీతంలో కూడా శిక్షణ ఇప్పిస్తున్నది. ఏది చెప్పినా ఇట్టే పట్టేస్తుందా పాప.

ఇంటి ముందు కారాగితే అటువైపు చూసింది గీతాబాయి. కారులోంచి ముగ్గురు వ్యక్తులు దిగారు.

"నమస్తే మేడమ్! నా పేరు చౌదరి. సినిమా దర్శకుడిని. ఇతను మురహరి. ప్రొడ్యూసర్. అతను నాయుడు. కెమేరామన్." పరిచయం చేసుకున్నారు. గీతాబాయి ఆశ్చర్యానికి అంతు లేదు. వారిని నవ్వుతూ ఆహ్వానించింది. కూల్ డ్రింక్స్ తెప్పించింది.

"మొన్న రవీంద్ర భారతిలో మీ పాప డాన్స్ షో చూశాము. మేము హీరోయిన్స్‌కు వారం పదిరోజులు ట్రెయినింగ్ ఇప్పించి చేయించే డాన్సులు మీ పాప అతి సులభంగా చేసింది. మీరు అంగీకరిస్తే మీ పాపకు మేము తీయబోతున్న సినిమాలో ఒక ముఖ్యమైన వేషం ఇవ్వాలనుకుంటున్నాం" అన్నాడు చౌదరి.

గీతాబాయి ఆశ్చర్యానికి హద్దులేకుండా పోయింది. "మా పాపకు సినిమా వేషమా!" నోరు తెరిచింది.

"అవును. ప్రస్తుతం రాంబాబు హీరోగా మేము తీస్తున్న భారీ చిత్రానికి ఒక క్యూట్ ఛైల్డ్ ఆర్టిస్టు కావాలి. రాంబాబు చాలా బిజీ హీరో అని మీకు తెలుసు. అతని కాంబినేషన్లో చాలా సీన్లుంటాయి. ఒక్క క్షణం కూడా వృధా కావడానికి వీల్లేదు. అలాంటి చురుకైన పిల్లలు ఎవరైనా దొరుకుతారేమోనని అప్పుడప్పుడు కల్చరల్ ప్రోగ్రామ్స్‌కు వెళ్తుంటాం. మీ పాప డాన్స్ షో చూసిన తరువాత మా సినిమాలో పాత్రకు మంచి ఆర్టిస్టు దొరికిందనుకుంటు న్నాం. పాప ఏం చదువుతున్నది?" అన్నాడు నాయుడు.

"సెంట్ గోబెల్స్‌లో నర్సరీ" చెప్పింది గీతాబాయి గొప్పగా.

"గ్రేట్... ఆ స్కూల్లో నర్సరీ అయినా ఒకటే ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మే అయినా ఒకటే" అన్నాడు మురహరి.

"పారితోషికం పది లక్షలిస్తాం. రెండు నెలలు పనిచేస్తే చాలు. ఇదిగో లక్షరూపాయలు అడ్వాన్స్." నోట్ల కట్టలను టీపాయ్ మీద పెట్టాడు చౌదరి.

గీతాబాయి కళ్ళు చెదిరిపోయాయి. "మావారితో ఒకసారి మాట్లాడి..." నసిగింది.

"ఆల్‌రైట్. రేపు ఉదయం ఫోన్ చేస్తాం. ఒక్కసారి పాపవి నాలుగు ఫోటోలు తీసుకుంటాం" అడిగాడు నాయుడు.

గీతాబాయి మేడపైకెళ్ళి చదువుకుంటున్న అనూహ్యను తీసుకొచ్చింది. పాపచేత మాట్లాడించారు. డాన్స్ చేయించారు. పోలరాయిడ్ కెమేరాలో ఫోటోలు తీశాడు నాయుడు.

"ఫెంటాస్టిక్. మోస్ట్ క్యూట్ బేబీ. మా సినిమా తరువాత పాప సూపర్ కిడ్ స్టార్ అవుతుంది" అన్నాడు చౌదరి.

* * *

రాత్రి పది గంటలకు ఇల్లు చేరాడు భూపతి రాజా. పాపకు వచ్చిన సినిమా అవకాశం గురించి చెప్పింది గీతాబాయి.

### దారుణం

దేశంలోని 7050 కంపెనీలలో 175 కంపెనీలు పబ్లిక్ ఇస్యూల పేరిట ప్రజల నుండి రూ. 950.41 కోట్లు వసూలు చేసి కనుమరుగయిపోయాయి.

### పుణ్యం కోసం

ప్రతిరోజూ గంగానదిలో సగటున యాభై వేలమంది భక్తులు స్నానాలు చేస్తారు. అయితే అడ్డమైన చెత్త, విసర్జన, కలుషిత పదార్థాలతో గంగాస్నానం హానికరంగా మారుతోందని అంటున్నారు.

### శ్రీరాముని జన్మస్థలి

ధర్మానికి ప్రతీకగా నిలచిన శ్రీరామచంద్రుని జన్మస్థలమైన అయోధ్యలో 6000 మందిరాలు ఉన్నాయి. వీటిలో 40 శాతం దేవాలయాలు భూకబ్జా కేసుల్లో ఇరుక్కుని ఉండగా, ఈ మందిరాల్లో ఉండే సాధువుల్లో 109 మంది నేరస్థులుగా కేసుల్లో ఇరుక్కుని ఉన్నారు. చాలామంది సాధువులుగా చెప్పబడే వారు రాత్రికి మందు విపరీతంగా సేవిస్తూ ఉంటారట!

"ఇంత చిన్న వయసులో సినిమా వేషాలా? దాని చదువు పాడైపోదూ" అన్నాడు భూపతి.

"ఎక్కడికి పోతుంది? ఈ సంవత్సరం కాకపోతే వచ్చే సంవత్సరం చదువుతుంది. కానీ ఇలాంటి అవకాశం ఎప్పుడంటే అప్పుడు రాదు కదా. పైగా బోలెడంత డబ్బు! దీంతోపాటు మరికొన్ని అవకాశాలు వస్తాయి. అమ్మాయికి పది సంవత్సరాలు వచ్చేసరికి పదికోట్లు సంపాదిస్తుంది. అంతే కాకుండా పేరు ప్రతిష్ఠలు వదులుకోవడం తెలివైన పని కాదు." నచ్చజెప్పసాగింది గీతాబాయి.

భూపతి రాజా ఆలోచనలో పడ్డాడు. భార్య చెప్పేదాంట్లో కూడా నిజం ఉంది. ఎంత చదువుకున్నా దాని ప్రయోజనం, పరమార్థం డబ్బు సంపాదనే. తన కూతురింకా ఇరవై సంవత్సరాలు చదవాలి. విదేశాలకు వెళ్ళాలి. ఉద్యోగాలూ చెయ్యాలి. ఎంతకాలం ఉద్యోగం చేసినా వచ్చే డబ్బు ఎంత? ఈ మధ్య తన వ్యాపారం కూడా మందికొడిగా సాగుతున్నది. తడవకోసారి మారిపోతుండే ప్రభుత్వ విధానాల వలన కంపెనీ లాభదాయకత ఒడిదుడుకులలో పడింది. అదృష్టం బాగుండి పాపకు ఇంకా అవకాశాలు వస్తే డబ్బుతోపాటు ఎనలేని కీర్తి, గౌరవం లభిస్తాయి. అందరికీ ఇలాంటి అదృష్టం పట్టదు కదా!

"అలాగే చేద్దాం. కానీ దాని సంరక్షణా భారమంతా నువ్వే చూసుకోవాలి. దాని రెమ్యూనరేషన్, కాల్‌షీట్స్ నువ్వే చూసుకోవాలి. సంఘసేవికగా నీకు, బాలనటిగా నా కూతురుకు బోలెడంత పేరు, ప్రచారం. ఏ గుర్తింపూ లేనిది నాకే." నవ్వాడు.

* * *

అనూహ్య నటించిన చౌదరి సినిమా ఘనవిజయం సాధించింది. అనూహ్య నటన, కొన్ని సన్నివేశాలలో చేసిన సాహసాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. అన్ని టీవీ ఛానెల్స్‌లోనూ అనూహ్య ఇంటర్వ్యూలు ప్రసారమయ్యాయి. నిర్మాతలు వేలం వెర్రిగా గీతాబాయి ఇంటిముందు క్యూ కట్టారు. హీరోకు ఏభై లక్షలైతే అనూహ్యకు కోటి రూపాయలు ఆఫర్ చేశారు. గీతాబాయి బాలకార్మికోద్ధరణ గురించి మర్చిపోయి చాలా కాలమైంది.

అకస్మాత్తుగా గీతాబాయికి పట్టిన అదృష్టం

రాధ, వందనలలో తీవ్ర అసూయ రగిలించింది. ఉద్యమంలో పాల్గొనమని గీతాబాయి మీద వత్తిడి తీసుకురాసాగారు. గీతాబాయికి ఇష్టంలేనప్పటికీ వారి వత్తిడికి లొంగక తప్పలేదు.

బస్సులో విలేకరుల బృందంతో బయలు దేరారు ముగ్గురూ. తాము ఇది వరకు వెళ్లిన గ్రామం మీదుగా వెళ్తున్నప్పుడు అప్పటి భూస్వామి ఇంటి ముందు కనిపించిన దృశ్యం గీతాబాయికి ఆగ్రహాన్ని కలిగించింది. తాము గతంలో వెట్టిచాకిరి నుంచి విముక్తం చేసిన పిల్లలు మళ్ళీ అక్కడ పనిచేస్తూ కనిపించారు.

అనూహ్యతో తరచుగా టీవీలో కనిపించే గీతాబాయిని అందరూ గుర్తుపట్టి బిలబిలమంటూ చుట్టూ మూగి ఆమెను తదేకంగా చూడసాగారు. రాధ, వందనలను పట్టించుకునే వారేలేరు. దాంతో వారు రగిలిపోయారు.

"భూస్వామిగారూ... బాలల చేత వెట్టి చాకిరీ చేయించకూడదని చెప్పి వీళ్ళను స్కూల్లో చేర్పించాం. వీరిని మళ్ళీ ఎందుకు పనిలో పెట్టుకున్నారు?" కోపంగా అడిగింది గీతాబాయి.

"ఆ మాట వాళ్ళనే అడగండి" అన్నాడు భూస్వామి.

"ఏం బాబూ... ఎందుకిలా చేశావు? నీ బంగారు బాల్యాన్ని ఇలాంటి చాకిరీతో ఎందుకు బలి చేస్తున్నావు?" రంగడిని అడిగింది గీతాబాయి.

"అమ్మగారూ... ఆ మధ్య ఒక సినిమా చూశాను. అందులో నాలుగేళ్ళ పాప నటించింది. నిప్పుల మీద నడిచింది. ఎత్తైన కొండకు కట్టిన తాడు కొస పట్టుకుని వేలాడింది. రెండు గుంజల మధ్య కట్టిన సన్నని తాడు మీద నడిచింది. బావిలో దూకి నీళ్ళలో మునక లేసింది. తరువాత ఆ పిల్ల ఇంకా చాలా సినిమాలలో నటించింది. ఆ పాపచేత అలాంటి పనులు చేయించడానికి సినిమా వాళ్ళు పాపను ఎంత హింస పెట్టారో? ఇన్ని సినిమాలలో నటిస్తున్నపుడు ఆ పాప స్కూలుకెళ్ళి చదువుకోవడం కుదిరేపని కాదు. నాలుగు సంవత్సరాల పసిగుడ్డుచేత రోజూ పదహారు గంటలు చాకిరీ చేయిస్తూ హింసిస్తున్నారే! అది వెట్టి చాకిరీ అని మీకు అనిపించలేదా?" అడిగాడు రంగడు.

కొరడాతో బాదినట్లైంది గీతాబాయికి. చెమటలు పోశాయి. "అ...అ...అది నటన... కళాపోషణ..." తడబడుతూ అన్నది.

"అది నటనే... ఆ నటన చెయ్యడానికి కూడా చాలా కష్టపడాలిగా. మాటలు కూడా సరిగా రాని పసికూన చేత రోజూ పదహారు గంటలు అరవచాకిరీ చేయిస్తే అది నటన! కోటీశ్వరులైన మీరు మీ పిల్లల్ని కష్టపెట్టి మరిన్ని కోట్లు సంపాదిస్తే అది కళాపోషణ! పేదరికంలో పుట్టి పొట్టకూటికోసం మేము పశువుల్ని మేపుకుంటే అది వెట్టిచాకిరీ! మేమేం కొండల్ని పిండి చెయ్యడంలేదు. మా కాళ్ళకు సంకెళ్ళులేవు. మా వయసుకు తగ్గపని చేసుకుంటూ ఇంత గంజి తాగుతున్నాం. బంగారు బాల్యం మాకే కాదు. మీ పిల్లలకు కూడా ఉంటుంది. అటువంటి పిల్లలను పాపిష్టి డబ్బుకోసం నాలుగేళ్ళ వయసు నుంచే నలగ్గొడుతున్నారు. పిల్లల చేత చాకిరీ చేయించడం నేరమైతే పెద్ద నేరగాళ్ళు మీరే. అందుకు శిక్ష జైల్లో పెట్టడమైతే ముందుగా మిమ్మల్ని జైల్లో పెట్టాలి" అన్నాడు రంగడు.

గీతాబాయి ముఖం పాలిపోయింది. గీతాబాయి అవస్థ చూసి రాధ, వందన నవ్వుకుంటున్నారు. రంగడు కొనసాగించాడు.

"మీ పిల్లలు ఇక్కడ చదువుకుని అమెరికా, లండన్ వెళ్ళి అక్కడ ఉద్యోగాలు చేసి కోట్లు సంపాదిస్తారు. వాళ్ళ తెలివితేటలన్నీ అక్కడ చూపిస్తారు. మేము చిన్నప్పటినుంచీ ఇక్కడే చదువుకుంటాం. ఈ పనే మా చదువు. పెద్దవాళ్ళం కాగానే వ్యవసాయదారులమై ఈ మట్టిలోనే పనిచేస్తాం. దేశానికి తిండి పెడతాం. మీ పిల్లల్ని స్కూళ్ళకు పంపండి. వాళ్ళ బాల్యాన్ని చంపద్దు. వెట్టి చాకిరీలని మా నోట మన్నుకొట్టద్దు" దణ్ణం పెట్టాడు రంగడు. ❋

**ఇది నిజం**

## దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్న పార్లమెంట్

పార్లమెంటు సజావుగా కొనసాగడానికి గంటకు 20.25 లక్షలు ఖర్చవుతోంది. రోజుకు 1.23 కోట్లు ఖర్చవుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత బడ్జెట్ సమయంలో 47 గంటలు లోక్‌సభలోనూ, 40 గంటలు రాజ్యసభలోనూ నిరుపయోగం అవడంవల్ల (మొత్తం 87 గంటలు) 17 కోట్ల 61 లక్షల 75 వేల (17,61,75,000) రూపాయలు నష్టం వచ్చిందట!

## ఆడలేక మద్దెల ఓడుదన్నట్లు

కర్నాటక ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చాలా ఆశ్చర్యకరంగానూ, ఇతర రాష్ట్రాలవారికి ప్రాణసంకటంగానూ వుంటున్నాయి.

తమిళనాడుకు కావేరి నీటి విషయంలోనూ, ఆంధ్రకు కృష్ణాజలాల విషయంలోనూ, కేంద్రం సలహాలను సయితం ఖాతరు చేయడం లేదు.

ఇప్పుడు, ఇతర భాషా చిత్రాలు తమ రాష్ట్రంలో విడుదలయితే కన్నడ చిత్రాలు, సరిగ్గా ఆడడం లేదన్న కారణంతో, ఇంగ్లీషు, హిందీ, తెలుగు, తమిళం వంటి ఇతర రాష్ట్రాల చిత్రాలను, అవి దేశంలో విడుదలయిన 7 వారాల తర్వాతే, తమ రాష్ట్రంలో విడుదల చేయాలని, కర్నాటక ప్రభుత్వం తేల్చి చెప్పింది.

ఈ పద్ధతి చాలా దారుణమని ఫిలిమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి సుప్రాన్ సేన్ విమర్శించారు.

- గాయత్రి

